క్లుప్తంగా

ఘనంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు



లలితాసహస్ర నామావళిలో పాల్గొన్న మహిళలు

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణ శివారులోని మనూరు చౌరస్తాలోని శ్రీచక్ర లలితాంబికాదేవి ఆలయంలో శ్రావణమాసం రెండవ శుక్రవారంను పురస్కరించుకుని కుంభ కుంకుమార్చన, లలితాసహస్ర నామావళి, కుంకుమార్చన, ప్రత్యేకపూజలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ వ్యవస్థాపకులు శ్రీపంతులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయా కార్యక్రమాల్లో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్టాపన



విగ్రహాల ఊరేగింపులో మహిళల కోలాటం

జహీరాబాద్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పోచమ్మ, బాలమ్మ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. శుక్రవారం ఆలయానికి భక్తులు విగ్రహాలతో ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు కోలాటం ప్రదర్శన నిర్వహిస్తూ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో యజ్ఞం, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బసవేశ్వరుడి మార్గంలో నడవాలి



భక్తులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న బసవధామ మాతాజీ

జహీరాబాద్ టౌన్: గొప్ప సంఘ సంస్కర్త బసవేశ్వరుడని, ఆయన చూపిన మార్గంలో నడవాలని కర్నాటక రాష్ట్రం బసవధామ మాతాజీ బసవేశ్వరి అన్నారు. లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో పట్టణంలోని బసవేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ఆమె శ్రావణ మాసం ప్రవచనాలను అందించారు. బసవేశ్వరుడి బోధనలు మానవజాతికి మార్గదర్శకాలని, ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. పట్టణంలోని దత్తగిరి కాలనీలో గల బసవ మండపంలో నాగూర్ గురుబసవ పీఠాధిపతి బసవగీత మాతాజీ కూడా ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా వారు భక్తులకు ఆశీర్వచాలు అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి



ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నారాయణఖేడ్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగంగా పనులు పూర్తి చేసుకోవాలని నిజాంపేట్ ఎంపీడీఓ సంగ్రాం సూచించారు. నిజాంపేట్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. బేస్‌మెంట్ పూర్తయిన లబ్ధిదారులకు రికార్డులు పూర్తి చేసి త్వరలో బిల్లులు చెల్లించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు.

జీవాలకు నీలినాలుక టీకాలు



గొర్రెలకు టీకా వేస్తున్న వైద్యాధికారి విశ్వచైతన్య

జిన్నారం(పటాన్‌చెరు): నీలి నాలుక వ్యాధి టీకాలను మేకలు, గొర్రెల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి విశ్వచైతన్య పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమ్మగూడెంలో నీలి నాలుక వ్యాధి టీకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలి నాలుక అనే వ్యాధి మేకలు, గొర్రెలకు వర్షాకాలంలో వ్యాప్తి చెందుతుందన్నారు. టీకాల పంపిణీ ఈనెల 8 వరకు ప్రతీ గ్రామంలో కొనసాగుతుందని తెలిపారు.

మహిళకు దన్నుగా మరిన్ని సంఘాలు

- కసరత్తు చేస్తున్న అధికారులు
- వీఓఏలకు బాధ్యతలు అప్పగింత
- జిల్లాలో 695 గ్రామ సంఘాలు
- ఓటరు జాబితా ఆధారంగా లేని వారి గుర్తింపు

సంగారెడ్డి జోన్: జిల్లాలో మరిన్ని మహిళా సంఘాలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు కొత్త సంఘాల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పేరుతో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయటమే ప్రధాన లక్ష్యంగా వివిధ పథకాలను ప్రవేశ పెడుతోంది. ప్రతి మహిళా ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వివిధ రకాల రుణాలు అందించి, లాభాలు వచ్చే ఆస్తులు కొనుగోలు చేసి సభ్యులకు అప్పగిస్తున్నారు.

ఓటరు జాబితా ఆధారంగా గుర్తింపు

గ్రామాల వారీగా ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితా ఆధారంగా సంఘాల్లో సభ్యులుగా లేని వారిని గుర్తించే విధంగా కార్యచరణ రూపొందించారు. 18 ఏళ్ల పైబడిన వారితోపాటు 60 సంవత్సరాల పైబడిన వారిని గుర్తించనున్నారు. గ్రూపులలో చేరకపోవడానికి గల కారణాలు తెలుసుకుని చేర్పించే విధంగా అవగాహన కల్పించనున్నారు.

మూడు రకాలుగా విభజించి గ్రూపులు ఏర్పాటు

కోటి మంది మహిళలను సభ్యులుగా చేర్పించేందుకు పలు నిబంధనలను తొలగించారు. అందులో భాగంగానే 15–20 ఏళ్లు(టీనేజీ), 18–59 ఏళ్ల లోపు ఉన్న వారిని జనరల్‌గా, 60 సంవత్సరాలు పైబడిన వారిని వృద్ధులుగా గుర్తించనున్నారు. ఈ విధంగా మూడు గ్రూపులుగా విభజించి ప్రత్యేక సంఘాలుగా ఏర్పాటు చేస్తారు. సంఘాల్లోని 60 ఏళ్లు పైబడిన వారి ఆర్థికాభివృద్ధితోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రత్యేకంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు.



వ్యాపార వేత్తలుగా మార్చేలా

మహిళా సంఘాలలో ఉన్న సభ్యులు వ్యాపార వేత్తలుగా మార్చేందుకు అవసరమయ్యే రుణాలను అందిస్తుంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, అంతర్గత, సీఐఎఫ్‌తోపాటు బ్యాంకు రుణాలను అందిస్తున్నారు. గతంలో కేవలం చిన్న వ్యాపారాల నిర్వహణతోపాటు వ్యవసాయం, ఇతర వాటికి రుణాలను అందించేది. ప్రస్తుతం ఇందిరా మహిళా శక్తి పేరుతో క్యాంటిన్లు, పెట్రోల్ బంక్, పార్లర్‌తోపాటు వివిధ రకాలుగా రుణాలను అందిస్తున్నారు.

జిల్లాలోని మహిళా సంఘాలు	15,074
సంఘాలలో ఉన్న మహిళా సభ్యులు	1,95,000
గ్రామైక్య సంఘాలు	695

జిల్లాలో 695 గ్రామ సంఘాలు

జిల్లాలో ప్రస్తుతం 695 గ్రామ సమైక్య సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాలలో ఒక లక్షా 95 వేలకు పైగా మంది సభ్యులుగా ఉన్నారు. కొత్తగా సభ్యులుగా చేర్పించే బాధ్యతలను సంబంధిత వీఓఏలకు అప్పగిస్తున్నారు.

సభ్యులుగా చేరి ఆర్థికాభివృద్ధి సాధించాలి



గ్రామాల్లోని ప్రతీ మహిళా స్వయం సహాయక సంఘాలలో సభ్యురాలిగా చేరి ఆర్థికాభివృద్ధి సాధించాలి. అర్హులైన వారిని గ్రూపులలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–జ్యోతి, డీఆర్‌డీఎ, సంగారెడ్డి జిల్లా

తల్లిపాలలో పిల్లల ఎదుగుదల పోషకాలు



నారాయణఖేడ్: తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): మాట్లాడుతున్న డాక్టర్ కల్పన

నారాయణఖేడ్: తల్లిపాలల్లో పిల్లల ఎదుగుదల, అభివృద్ధికి అవసరమైన పోషకాలు ఉంటాయని ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాత, నిజాంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డా.తరణి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఖేడ్ మండలం లింగాపూర్ అంగన్వాడీ కేంద్రం–2లో తల్లులకు తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తల్లిపాలల్లో రోగనిరోధక శక్తిని పెంచి వివిధ ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షించే యాంటీ బాడీలు ఉంటాయన్నారు. పిల్లలకు తల్లిపాలను అందించే ఆవశ్యకత, తద్వారా కలిగే ప్రయోజనాలను సమగ్రంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. ఏసీడీపీఓ సుశీల, ఎంఎల్‌హెచ్‌పీ అరవింద్, అంగన్వాడీ టీచర్లు ఇందిర, విజయ, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త శాంత, ఆశా కార్యకర్తలు లక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యమని పీహెచ్‌సీ వైద్యురాలు కల్పన అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డకు పాలు ఇచ్చే తల్లులు మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు.

వీధి కుక్కల బెడదకు చర్యలు



వీధి కుక్కల పట్టివేతపై సూచనలిస్తున్న కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల బెడదకు శుక్రవారం చర్యలు చేపట్టారు. పలు కాలనీల్లో వీధి కుక్కలు పెద్ద సంఖ్యలో గుంపులుగా సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో శునకాలను పట్టుకుని ఏబీసీ కేంద్రానికి తరలించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. వాటిని వలల ద్వారా పట్టుకునే వారిని పిలిపించి కాలనీల్లో సంచరిస్తున్న వాటిని పట్టుకుని వ్యానులో తరలించే ప్రక్రియ చేపట్టారు. కమిషనర్ జగ్జీవన్, పారిశుద్ధ్య అధికారి శ్రీనివాస్ పర్యవేక్షిస్తూ సూచనలు, సలహాలిచ్చారు.

పేరుకుపోయిన చెత్తను తొలగించాలి



చెత్తను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప, అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని కానుకుంటలో శుక్రవారం కార్పొరేటర్ పుష్ప, జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ సురేశ్, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈసందర్భంగా స్థానికులు కాలనీలో చెత్త ఎవరూ తొలగించడం లేదని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. రోడ్లపై నీరు నిలవడంతోపాటు దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. దీంతో అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. అధికారులు దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాలనీలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. కాలనీవాసులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ మాట్లాడుతూ.. గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో తొమ్మిది మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి, మరో ముగ్గురికి రూ. 1,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

4న వేణుమాధవ్ భద్రాచలం పాదయాత్ర

సదాశివపేట(సంగారెడ్డి): లోక కల్యాణార్థం ఈనెల 4న సదాశివపేట పట్టణం శ్రీ కృష్ణానగర్ కాలనీ పంచముఖ హనుమాన్ దేవాలయం నుంచి భద్రాచలం సీతారామచంద్ర దేవస్థానం వరకు 22 రోజుల పాటు పాదయాత్ర చేయనున్నట్లు బీజేపీ సీనియర్ నాయకుడు వేణుమాధవ్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..పాదయాత్రలో పాల్గొనడానికి స్వచ్ఛందంగా భగవత్ బాంధవులు, హిందూ భక్తులు, పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. పాదయాత్రలో పాల్గొనే భక్తులందరికీ మౌలిక వసతుల కల్పన, భోజన వసతి కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



కేజీబీవీ బాలికల పాఠశాలలో డిజిటల్ పాఠ్యాంశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శంకర్

కేజీబీవీ బాలికల పాఠశాల తనిఖీలో ఎంఈఓ శంకర్

సదాశివపేట(సంగారెడ్డి): మెనూ ప్రకారం విద్యార్థులకు మంచి రుచికరమైన భోజనం వండి వడ్డించాలని ఎంఈఓ శంకర్ పేర్కొన్నారు. పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను శుక్రవారం ఎంఈఓ శంకర్ తనిఖీ చేశారు. ముందుగా ఖాన్ అకాడమీ రూపొందించిన డిజిటల్ పాఠ్యాంశాలు, గణితం, జీవశాస్త్రం, భౌతికశాస్త్ర విభాగాల్లో విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. డిజిటల్ పాఠ్యాంశాలు బోధన బాగుందని ప్రశంసించారు. తరగతి వారీగా అటెండెన్స్ రిజిస్టర్లు పరిశీలించి చాలా రోజులుగా పాఠశాలకు రాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడాలని ఎస్‌ఓకు సూచించామన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ లలిత, సీఆర్పీ రాజేశ్వర్, పీజీ–సీఆర్టీలు, సీఆర్టీలు పాల్గొన్నారు.

బోధన నైపుణ్యం మెరుగుపడాలి

మనోహరాబాద్(తూప్రాన్): బోధనా నైపుణ్యం మెరుగుపడాలని కాళ్లకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నర్సింగం అన్నారు. శుక్రవారం కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం జరిగింది. శిక్షణకు తూప్రాన్, మనోహరాబాద్, వెల్దుర్తి, మాసాయిపేట మండలాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రారంభ పరీక్ష, కనీస అభ్యసన స్థాయి, కనీస సామర్థ్యాల సాధన, బోధనలో సాంకేతిక వినియోగం వంటి అంశాలపై విషయ నిపుణులు శ్రీధర్, అంజిరెడ్డి వివరించారు.

ఎవరి దారి వారిదే



తన క్యాంపు కార్యాలయం నుంచి అనుయాయులతో తరలివెళుతున్న మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్

జహీరాబాద్: ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్ జనహిత పాదయాత్రకు కాంగ్రెస్ పార్టీ నేతలు ఎవరికి వారే తరలివెళ్లారు. శుక్రవారం అందోల్ నియోజకవర్గంలోని సంగుపేట నుంచి చేపట్టిన పాదయాత్రకు జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు తమ తమ అనుయాయులతో వేరు వేరుగా తరలివెళ్లారు. సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్‌లు తమ క్యాంపు కార్యాలయాలకు అనుచరులను పిలిపించుకుని వాహనాల్లో తరలివెళ్లారు. దీంతో మరో మారు పార్టీలో ఉన్న విభేదాలు బయటపడ్డాయి. అసెంబ్లీ ఎన్నికల అనంతరం జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో నాలుగు గ్రూపులు ఏర్పడిన విషయం తెలిసిందే. ఇలా గ్రూపులు ఉండడంతో సామాన్య కార్యకర్తలు ఎవరి దగ్గరకు వెళ్లాలనే విషయం తెలియక అయోమయానికి గురవుతున్నారు.



తన క్యాంపు కార్యాలయం నుంచి అనుయాయులతో తరలివెళుతున్న సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

కౌడిపల్లి(నర్సాపూర్): ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని ఏఓ స్వప్న తెలిపారు. శుక్రవారం మండలంలోని తునికి దేవులతండా, మహమ్మద్‌నగర్‌లో పది ఎకరాలలో ఆయిల్ పామ్ సాగును పరిశీలించారు. రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మట్లాడుతూ.. రైతులు వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేయాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తుందన్నారు. ఒక్కసారి సాగు చేస్తే నాలుగు సంవత్సరాల నుంచి నిరంతరం ఆదాయం వస్తుందన్నారు. రైతులు ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నాలుగేళ్ల వరకు అంతర పంటను సైతం సాగు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నరేందర్, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఫీసర్ మౌనిక, రైతులు కొర్రశ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాండం తొలిచే పురుగు నివారణకు చర్యలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలను కాండం తొలిచే పురుగు ఆశించినట్లు మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం మక్కరాజీపేటలోని వరి పంటలను ఏఓ హరిప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వరి చేలకు కాండం తొలిచే పురుగు ఆశించినట్లు నివారణ చర్యలను రైతులకు వివరించారు. ప్రస్తుతం ఎకరా వరి పంటకు 10 కేజీల చొప్పున కార్బోఫురాన్ గుళికలను చల్లాలని రైతులకు సూచించారు.



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత



సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

ఆలయాలకు శ్రావణ శోభ

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. శ్రావణమాసం రెండో శుక్రవారం కావడంతో సంతోషిమాత, మహంకాళి దేవాలయాలు భక్తులతో సందడిగా మారాయి. మహిళలు అమ్మవారికి సామూహిక వ్రతాలు, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– పటాన్‌చెరుటౌన్:

తెగుళ్లు సోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



సోయా పంటను పరిశీలిస్తున్న ఎంఏఓ అభినాష్ వర్మ

న్యాల్‌కల్(జహీరాబాద్): పంటలకు తెగుళ్లు సోకే అవకాశం ఉన్నందున రైతులు తగు జాగ్రతలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అభినాష్ వర్మ రైతులకు సూచించారు. మండల పరిధిలోని ఖలీల్‌పూర్, రేజింతల్ గ్రామాల శివారులో రైతులు సాగు చేసిన సోయాబీన్, చెరకు పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం సోయాబీన్‌కు పచ్చ పురుగు, ఆకు తినే పురుగు సోకే అవకాశం ఉందన్నారు. తెగుళ్లు సోకితే క్లోరో పైరి పాస్ మందును పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. చెరకు పంటలకు మోతాదుకు మించి యూరియా వాడరాదని తెలిపారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..



బుదేరా నుంచి పాదయాత్రకు బయలుదేరుతున్న కాంగ్రెస్ నాయకులు

మాజీ ఎంపీపీ రాంరెడ్డి

మునిపల్లి(అందోల్): ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో అభివృద్ధే లక్ష్యంగా ముందుకు పోతున్నామని మాజీ ఎంపీపీ రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు సంగుపేటలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి నటరాజన్ మీనాక్షి నిర్వహిస్తున్న పాదయాత్రకు బయలుదేరారు. బుదేరాలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. రైతు భరోసాను మంజూరు చేసి అదుకుందన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు సతీష్ కుమార్, పాండు, విజయ్ కుమార్, వీరన్న పాటిల్, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

బొల్లారంలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం



కాలనీ వాసులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ కిషన్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పరిధిలోని వివిధ వార్డుల్లో చేపట్టిన పనులను ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ కమిషనర్ కిషన్‌తో కలిసి పర్యవేక్షించారు. కాలనీ వాసులకు తడి, పొడి చెత్త, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం భువన్ సర్వే, జియో ట్యాగింగ్ సర్వే పనుల పురోగతిపై ఆరా తీశారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, శానిటేషన్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

రేడియల్ రోడ్డు దుస్థితి..



సగభాగం మట్టితో నిండిన తెల్లాపూర్ నుంచి కొల్లూర్ వెళ్లే రేడియల్ రోడ్డు



భారీ వాహనలు పోవడంతో లేస్తున్న దుమ్ము

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి చేసిన రేడియల్ రోడ్లు నేడు మట్టి, బురదకు నిలయంగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో అనేక కాలనీలు ఏర్పడి.. పెరిగిన జనాభా అనుగుణంగా ప్రభుత్వం రేడియల్ రోడ్లను అభివృద్ధి చేసింది. కాని అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా రేడియల్ రోడ్లు పూర్తిగా ధ్వంసమయాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్లపై భారీ వాహనాలు రాకపోకల కారణంగా రోడ్లు మట్టితో నిండి ధ్వంసమయ్యాయి. భారీ వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము లేవడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము కళ్లలో పడటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై మట్టి లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.